సాక్షి శ్రీకాకుళం

బుధవారం ׀ 6 ׀ నవంబర్ ׀ 2024



ఫోన్ పోయిందా..?

పోయిన ఫోన్లను పోలీసు శాఖ ఇట్టే కనిపెడుతోంది. చాలా ఫోన్లను రికవరీ చేశారు. - 8లో




విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ట్రిపుల్ ఐటీలో ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. - 8లో

13న శ్రీకూర్మనాథుని తెప్పోత్సవం

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో ఈ నెల 13న క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకొని సాయంత్రం నాలుగు గంటల నుంచి తెప్పోత్సవం జరుగుతుందని ఆలయ ఇన్‌చార్జి ఈఓ జి. గురునాథం తెలిపారు. ఆలయం ఎదురుగా నున్న శ్వేతపుష్కరిణిలో జరుగుతుందని, కూర్మనాథునికి ప్రత్యేక అభిషేకాలు ఉదయం జరుగుతాయని, భక్తులు ఉత్సవంలో పాల్గొనాలని కోరారు.

ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని భామిని మండలం తాలాడ సమీపం లోని వంశధార నదిలో అక్రమంగా నడుపుతున్న ఇసుక ర్యాంపు నుంచి లారీల ద్వారా ఇసుక తరలిపోతున్న దృశ్యమిది. రోజుకి వందలాది లారీలతో ఇక్కడి నుంచి ఇసుక తరలిపోతోంది.



జనసేన ఎమ్మెల్యే అడ్డాలో ఇసుక దోపిడీ



ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని భామిని మండలం పసుకుడి వద్ద వంశధార నదిలో అనధికారికంగా తవ్వకాలు చేస్తున్న ర్యాంపు వద్దకు ఇసుక అక్రమ రవాణా చేసేందుకు వేసిన బాట ఇది. ఈ రోడ్డు మీదుగానే వందలాది లారీలతో నదిలో నుంచి ఇసుకను తరలించేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా పరిధిలోని అలికాం–బత్తిలి రోడ్డులో ఇటీవల ఇసుక లారీ కూరుకుపోయిన దృశ్యమిది. టన్నుల కొద్దీ లోడులతో ప్రతి రోజూ రవాణా చేస్తున్న లారీల కారణంగా ఈ రోడ్డు ధ్వంసమైపోయింది. ఇప్పుడా రోడ్డులో ప్రయాణించాలంటేనే భయమేస్తోంది.





అక్రమంగా నడుపుతున్న ర్యాంపు నుంచి ఇసుక తరలించేందుకు వాడుతున్న నకిలీ బిల్లులివి. ఒడిశాలోని ఛత్రపూర్ భామినిలో ఆ రాష్ట్ర ప్రభుత్వం నడుపుతున్న ఇసుక బెడ్ నుంచి ఇసుక తీసుకొస్తున్నట్టుగా అక్కడి బిల్లులను ఇక్కడ నుంచి రవాణా చేస్తున్న లారీలకు ఇస్తున్నారు. ఎవరైనా మార్గమధ్యంలో లారీలను అడ్డుకుంటే ఒడిశాలోని ఛత్రపూర్ భామిని నుంచి తీసుకొస్తున్నట్టుగా ఆయా నకిలీ బిల్లులను చూపిస్తున్నారు.

- ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని భామిని మండలంలో అడ్డగోలుగా తవ్వకాలు
- వంశధార నదిలో మూడు చోట్ల ఇసుక అక్రమ ర్యాంపులు
- ఒడిశా బిల్లులతో అక్రమ రవాణా
- కూటమి నేతల కనుసన్నల్లో ఒక్కో లారీకి రూ.25వేల నుంచి రూ.40వేలు వసూలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఉమ్మడి జిల్లా పరిధిలోని పాలకొండ నియోజకవర్గం భామిని మండలంలో మూడు చోట్ల ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. తాలాడ, పసుకుడి, సింగిడి–బిల్లుమడ వద్ద దర్జాగా ఇసుక దోపిడీ జరుగుతోంది. ఇక్కడ జనసేన ఎమ్మెల్యే ఉన్నారు. కూటమి నేతల కనుసన్నల్లో ఇసుక అక్రమ రవాణా జరిగిపోతోంది. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతమని చెప్పి తమ పరిధి కాని రీతిలో అధికారులు సైతం ముడుపులు తీసుకుని చోద్యం చూస్తున్నారు. దీంతో ఇసుక అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఈ మూడు ప్రాంతాల్లో ఇసుక లారీల జాతరే కనబడుతోంది. ఒక్కో ర్యాంపు నుంచి కళ్లముందు ప్రతి రోజూ వందలాది లారీలతో ఇసుక తరలిపోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అటు పాలకొండ నియోజకవర్గ నేత, ఇటు పాతపట్నం నియోజకవర్గ నేత కలిసి ఈ ఇసుక దోపిడీ సాగిస్తున్నారు. రోజుకి రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు.

భారీ యంత్రాలతో తవ్వకాలు

అనుమతి ఉన్న ర్యాంపుల్లోనే భారీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టడానికి వీల్లేదు. ర్యాంపులోకి లారీలకు అనుమతి లేదు. కానీ అనుమతుల్లేకుండా నడుస్తున్న అక్రమ ర్యాంపుల్లో జేసీబీలు, పొక్లెయినర్లు పెట్టి వంశధార నదిని తవ్వేస్తున్నారు. నదిని గుల్ల చేసేసి కూటమి నేతలు తమ జేబులు నింపుకుంటున్నారు. కృష్ణ, సాగర్ అనే పాలకొండ–పాతపట్నం వ్యక్తుల అండతో ఇక్కడ ఇసుక తవ్వకాలు దర్జాగా జరిగిపోతున్నాయి. తిలాపాపం తలా పిడికెడు అన్నట్టుగా ఇక్కడ జరుగుతున్న అక్రమాలను

దందా ఇలా..

పొరుగున ఉన్న ఒడిశా రాష్ట్రంలో అధికారిక ఇసుక ర్యాంపులు నడుస్తున్నాయి. అక్కడి ప్రభుత్వ అనుమతితో కూడిన బిల్లులను జారీ చేస్తున్నారు.

- ఒడిశాలో ఛత్రపూర్ భామిని బెడ్ అనే ఒక ర్యాంపు నడుస్తోంది. ఆ ర్యాంపునకు సంబంధించిన బిల్లులను ఉమ్మడి జిల్లాలోని భామిని మండలంలో గల తాలాడ, పసుకుడి, సింగిడి–బిల్లుమడలో నడుస్తున్న అనధికార ర్యాంపుల వద్ద వినియోగిస్తున్నారు.
- ఒడిశాలోని ఛత్రపూర్ భామిని పేరుతో ఉన్న బిల్లులను ఇక్కడ ముద్రించి, అనధికార ర్యాంపుల నుంచి తరలిస్తున్న ఇసుక లారీలకు ఇస్తున్నారు.
- ఈ బిల్లుల లారీకి, వాటిని పట్టుకోకుండా ఉండటానికే ఒక ముఠాయే పనిచేస్తోంది.
- ఇసుక ర్యాంపుల నుంచి అలికాం–బత్తిలి ప్రధాన రోడ్డు వద్దకు వచ్చేలోపు ఎవరూ పట్టుకోకుండా ఉండేలా ఈ ముఠా ఎస్కార్ట్‌గా ఉంటుంది.

అడ్డుకోకుండా ఉండేందుకు అధికారులకు, నిఘా సిబ్బందికి పెద్ద ఎత్తున ముడుపులు చెల్లిస్తున్నారు.

ఒక్కో లారీకి రూ.25 వేల నుంచి 40వేలు

అక్రమంగా నడుపుతున్న తాలాడ, పసుకుడి, సింగిడి–బిల్లుమడ ర్యాంపుల నుంచి ఒక్కో లారీకి 20 టన్నుల చొప్పున లోడ్ చేసి, బయటికి పంపించేందుకు ఒక్కొక్క లారీకి రూ. 25వేల నుంచి రూ. 40వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇటీవల జిల్లాలో అధికారిక ర్యాంపులు పెరగడంతో కాస్త డిమాండ్ తగ్గడం వల్ల లారీకి సరాసరి రూ.25వేలు వసూలు చేస్తున్నారు. డిమాండ్ ఎక్కువ ఉంటే రూ. 40వేల వరకు తీసుకుంటున్నారు. అంతకుముందైతే సరాసరి లారీకి రూ. 40వేల నుంచి రూ. 45వేలు తీసుకునే వారు. ఇదంతా అక్కడి నేతల జేబులోకి వెళ్తోంది. అక్రమ దందాను అడ్డుకోకుండా ఉండడానికి స్థానికులకు సైతం ముడుపులిస్తున్నారు. ఎవరి నుంచి అడ్డంకులు రాకుండా చేతులు తడుపుతున్నారు.

ఆంధ్రా– ఒడిశా సరిహద్దు ప్రధాన రోడ్డు ధ్వంసం

ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలను కలిపే అలికాం– బత్తిలి ప్రధాన రోడ్డు ఇసుక లారీల రవాణాతో ధ్వంసమైపోయింది. ఒక్కొక్క లారీ 20కిపైగా టన్నుల సామర్థ్యంతో, ప్రతి రోజూ వందలాది లారీల ఇసుక రవాణా చేస్తుండటంతో ప్రధాన రోడ్డు పాడైపోయి, ఎక్కడికక్కడ గతుకుల మయమై ప్రమాదకరంగా తయారైంది. ఆ రోడ్డు గుండా వెళ్లాలంటే ప్రయాణికులకు ప్రాణాలతో చెలగాటంగా మారింది.

శాఖలపై కలెక్టర్ సమీక్ష



నీటి యాజమాన్య సంఘాల ఓటరు జాబితాలను ఈనెల 9వ తేదీ నాటికి సిద్ధం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పలు శాఖలపై ఆయన సమీక్షించారు. ఎస్ఈ ఆర్అండ్‌బీ పరిధిలో కోర్టు కేసుల పెండింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణాలపై శ్రద్ధ చూపించాలన్నారు. అపార్ ఐడీ కార్డులు విద్యార్థులకు చాలా కీలకమని, 60.79 శాతం మాత్రమే పూర్తయ్యిందని, సోంపేట, మెళియాపుట్టి, పాతపట్నంలో మందకొడిగా సాగుతోందని తెలిపారు. అనంతరం పలు శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతిని వివరించారు.

– శ్రీకాకుళం పాతబస్టాండ్



చవితి సంబరం

చవితి వేళ చెట్టు పుట్ట వేడుకగా మారాయి. అనాదిగా వస్తున్న సంప్రదాయానికి సూచికగా పవిత్ర దీపాలు వెలిగాయి. నువ్వుల నైవేద్యాలతో అర్చనలు జరిగాయి. శ్రీకాకుళం మహలక్ష్మీనగర్‌లోని దృశ్యమిది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

టెన్త్ జీవశాస్త్ర మెటీరియల్ ఆవిష్కరణ



చదువులో వెనుకబడిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయుక్తంగా, తెలివైన విద్యార్థులకు మంచి మార్కులు స్కోర్ చేసేందుకు దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్. తిరుమల చైతన్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం (ఏపీ బీఎస్‌టీఎఫ్) రాష్ట్ర అకడమిక్ సెల్ ఆధ్వర్యంలో రూపొందించి పదో తరగతి విద్యార్థుల స్టడీ మెటీరియల్‌ను మంగళవారం డీఈఓ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో బయలాజికల్ టీచర్స్ ఫోరం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పుట్టా ఉదయకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, కోశాధికారి వాడాడ త్రివిక్రమరావు, సభ్యులు కంచరాన నాగరాజు, మజ్జి మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ

క్లుప్తంగా

13 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 5వ సెమిస్టర్ రెగ్యులర్ సప్లిమెంటరీ, ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 13 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు యూసీ ఇన్‌చార్జి ఎగ్జామినేషన్స్ డీన్ జి.పద్మారావు తెలిపారు. వర్సిటీ ఎగ్జామినేషన్స్ కార్యాలయంలో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు 62 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హాల్ టికెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. డిగ్రీ మూడో సెమిస్టర్‌కు సంబంధించి రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 11లోపు పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య



జీడిచెట్టుకు వేలాడుతున్న మృతదేహం

ఆనందరావు(ఫైల్)

కంచిలి: మండలంలోని జాడుపూడి గ్రామానికి చెందిన కదంబాల ఆనందరావు(53) జీడి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆనందరావు మనస్తాపంతో సోమవారం రాత్రి ఉరి వేసుకున్నాడు. మృతుడి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ జి.రాజేష్ మంగళవారం ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిత్రలేఖనం పోటీల్లో సన్నిహిత్‌కు రజతం



శ్రీకాకుళం కల్చరల్: అంతర్జాతీయ చిత్ర లేఖనం పోటీల్లో బొమ్మిడాల సన్నిహిత్‌కు రజత పతకం లభించిందని ఎంసీఏ అధినేత మణి పాత్రుని నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కాసుల చిత్రకళా అకాడమీ అధినేత్రి కె.పద్మావతి ఆధ్వర్యంలో రామాయణ్ సీజన్–2 పేరిట ఇటీవల అంతర్జాతీయ స్థాయి చిత్రకళా పోటీలు జరిగాయి. సన్నిహిత్ ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నాడు. సన్నిహిత్‌తో పాటు కృష్ణప్రియ పండా, ఎం.లిపి, శ్రీవల్లి, ఎం.జయదేవ్‌కుమార్, జి.భవిష్‌లు కూడా ప్రశంసాపత్రాలు సాధించారు. వీరికి అవార్డులు రావడం పట్ల ఎంసీఏ ప్రతినిధులు పి.రామకృష్ణ, దమ్ము రామారావు, ఎస్‌టీవీఆర్ మూర్తిలు అభినందించారు.

మహిళల భద్రతకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్



పొందూరు పోలీసు స్టేషన్ వద్ద మొక్కలు నాటుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పొందూరు: జిల్లాలో నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం పొందూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ నిరోధానికి, మహిళల భద్రతకు ప్రత్యేక టాస్క్‌ఫోర్సును నియమించినట్లు తెలిపారు. నేర నియంత్రణపై అవగాహనకు మహిళా పోలీసులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. మహిళా పోలీసు ప్రస్తుతమున్న ఉద్యోగాలతోనే సరిపెట్టుకోకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ హామీలన్నీ అమలుచేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న లిబరేషన్ నాయకులు

పలాస: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బొడ్డపాడు జిల్లా అమర వీరుల స్మారక మందిరంలో మంగళవారం పోస్టర్లు ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు మాట్లాడుతూ డిసెంబరు 4న విజయవాడలో జరగనున్న ప్రజాహక్కుల సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు లిబరేషన్ పార్టీ జాతీయ కార్యదర్శి దిపాంకార్ భట్టాచార్య ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దిల రామారావు, దున్న శ్రీనివాసరావు, కుత్తుం దుష్యంత్, పోతనపల్లి కామేశ్వరరావు, యుగంధర్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.



ఫోన్ పోయిందా?

- బాధితులకు అండగా నిలుస్తున్న సీఈఐఆర్ పోర్టల్
- మొబైల్ పోయిన వెంటనే ఫిర్యాదు చేస్తే రికవరీ సులువు
- ఇప్పటికి రూ.కోటికి పైగా విలువైన 772 ఫోన్లు అందజేసిన జిల్లా పోలీసులు



శ్రీకాకుళం క్రైమ్: మొబైల్‌ఫోన్.. ఇప్పుడు ప్రతిఒక్కరి అవసరం. మాట్లాడటం సంగతి పక్కన పెడితే వ్యాపార లావాదేవీలు, బిల్లుల చెల్లింపులు, ఈఎంఐలు.. ఇలా ఒకటేమిటి ప్రతి పనికీ మొబైల్ ఉండాల్సిందే. అందుకే ప్రాణప్రదంగా ఫోన్‌ను కాపాడుకుంటాం. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్నిసార్లు ఫోన్ పోగొట్టుకుంటాం. అలాంటప్పుడు కూర్చుని బాధపడటం కంటే వెంటనే సైబర్ సెల్‌ను ఆశ్రయిస్తే ఫలితం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.

జాప్యం లేకుండా ఫిర్యాదు..

మొబైల్ ఫోన్ చిన్నదైనా.. పెద్దదైనా పోగొట్టుకున్న వెంటనే ఫిర్యాదు చేస్తే అక్కడికి కొద్దిరోజుల్లోనే బాధితులకు అందిస్తున్నారు జిల్లా పోలీసులు. కాకపోతే బాధితులు చేయాల్సిందల్లా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తక్షణమే ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

రూ. 1.03 కోట్ల విలువైన 772 ఫోన్లు..

ఈ ఏడాది ఆగస్టు 9న 100 ఫోన్లను బాధితులకు అందించిన జిల్లా పోలీసు శాఖ.. తాజాగా రూ.24 లక్షలు విలువైన 154 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1600 మందికి పైగా బాధితులు ఫిర్యాదు చేస్తే రూ.1.03 కోట్ల విలువ చేసే 772 ఫోన్లను (గతంలో రూ. 79 లక్షలు విలువ చేసే 618 ఫోన్లుతో కలిపి) బాధితులకు అందజేశారు.

ఏమిటీ సీఈఐఆర్..

ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే తక్షణమే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ది టెలీ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.



ఇటీవల స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు



మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి రికవరీ చేసే సైబర్ బృందంతో ఎస్పీ(ఫైల్)

నమోదు ఇలా..

- సీఈఐఆర్.జీఓవీ.ఐఎన్ అనే వెబ్‌సైట్‌కి వెళ్లి ముందుగా బ్లాకింగ్ రిక్వెస్ట్‌ను రిజిస్టర్ చేయాలి.
- మొబైల్ ఐఎంఈఐ నంబర్లు బ్లాక్ చేశాక జిల్లాలోని సైబర్ సెల్ విభాగం రిక్వెస్ట్‌ను రిసీవ్ చేసుకుంటుంది.
- అనంతరం మొబైల్‌ను ట్రాక్ చేసి రికవరీ చేస్తారు.
- మొబైల్‌ను అన్‌బ్లాక్ చేసి పోగొట్టుకున్న బాధితునికి అందజేస్తారు.

టెక్నాలజీతో జల్లెడ పట్టేస్తారు..

సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేసిన తక్షణమే జిల్లా సైబర్‌సెల్ కు ఫిర్యాదు చేరుతుంది. ఈలోగా బాధితుడు దగ్గరలో ఉన్న పీఎస్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి. అనంతరం సైబర్‌సెల్ నిపుణుల బృందం(సీఐ టి.శ్రీను పర్యవేక్షణలోని సిబ్బంది పైలా శరత్‌చక్రవర్తి(చక్రి), గురుగుబిల్లి శేషగిరిరావు, తోట సుధీర్, పంగ సత్యనారాయణ, పద్మజ్యోతి, కుసుమ) తమ నైపుణ్యంతో ట్రాక్ చేస్తారు. లక్ష రూపాయల ఫోన్ అయినా.. రూ.500 విలువైన ఫోన్ పోయినా ఒకేలా భావించి రికవరీ చేయడానికి కృషిచేస్తారు. ఇప్పటివరకు లాస్ట్‌మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్ (ఎల్ఎంటీఎస్) పోర్టల్ ద్వారా 316, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 456 మొబైళ్లు అందించామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఇటీవల వెల్లడించారు.

దళిత మహిళా మంత్రిని అవమానిస్తారా?

- డిప్యూటీ సీఎం పవన్ వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ దువ్వాడ ఖండన



దువ్వాడ శ్రీనివాస్ ఎమ్మెల్సీ

టెక్కలి: దళిత మహిళా మంత్రిపై అజమాయిషీ చెలాయించేలా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు అవమానకరమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ దుయ్యబట్టారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమిలో కొట్లాట ప్రారంభమయ్యాయని విమర్శించారు. పిఠాపురం సభలో హోంమంత్రి అనితపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో సుమారు 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని ఆనాడు పవన్ తీవ్రంగా విమర్శలు చేశారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మహిళలను ఎందుకు తీసుకురాలేకపోతున్నారని దువ్వాడ ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఆడపిల్లలపై అఘాయిత్యాలు పెచ్చుమీరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ హామీలు అమలుపై పవన్ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ఒక వైపు రైతు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని, విత్తనాలు, ఎరువులు అందని పరిస్థితి నెలకొందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో దోపిడీ వ్యవస్థకు తెరతీశారని విమర్శించారు. నెలల వ్యవధి పాలనలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల నుంచి తిరుగుబాటు వచ్చిందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.

సోషల్‌మీడియాలో ప్రశ్నిస్తే కేసులా?

- వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్



పిట్ట దామోదర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టడం, పోలీసుస్టేషన్‌కు పిలిపించి రాష్ట్ర వ్యాప్తంగా వేధించడం దారుణమని వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ట దామోదర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశ్నించడం రాజ్యాంగం కల్పించిన పౌరుల ప్రాథమిక హక్కు అని, దాన్ని భంగం కలిగించడం సరికాదన్నారు. ప్రశ్నించే గొంతు నొక్కాలని ప్రయత్నం చేస్తున్న ప్రభుత్వ కక్ష పూరిత చర్యలు సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్‌కు వ్యతిరేకమని పేర్కొన్నారు. రాష్ట్ర పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లకుండా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయపరంగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో లీగల్ సెల్‌ను సంప్రదించి తమ దృష్టికి తీసుకొస్తే అండగా ఉంటామన్నారు.

అత్తకు తలకొరివి పెట్టిన కోడలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న తులసమ్మ

సోంపేట: కన్నకొడుకులే తల్లిదండ్రులను సరిగ్గా పట్టించుకోని కాలంలో కోడలే అన్నీ తానై అత్తకు సపర్యలు చేసింది. మృతి చెందిన తర్వాత తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. కవిటి మండలం బెజ్జిపుట్టుగ గ్రామానికి చెందిన యజ్జల గోపమ్మకు కుమారుడు ప్రసాద్, కుమార్తె ఉన్నారు. కుమారుడు, కుమార్తె వలస కార్మికులుగా బెంగళూరులో ఉపాధి పొందుతున్నారు. గోపమ్మ తన కోడలు తులసమ్మతో కలిసి జింకిభద్రలో నివాసముంటోంది. గోపమ్మ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో మంగళవారం మృతి చెంది. కుమారుడు అందుబాటులో లేకపోవడంతో కోడలు తులసమ్మ దహన సంస్కారాలు నిర్వహించింది. గ్రామస్తులు తమవంతు సహాయ సహకారాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక మెళియాపుట్టి రోడ్డులో మంగళవారం ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కోటబొమ్మాళి మండలం ఊడికలపాడు గ్రామానికి చెందిన తోట రామారావు, ఉర్జాన సాంబమూర్తి బైక్‌పై టెక్కలి వస్తూ మెళియాపుట్టి ఫ్లెటైవర్ బ్రిడ్జి నుంచి కిందకు దిగుతుండగా.. టెక్కలి నుంచి బైక్‌పై వస్తున్న యువకులు పరస్పరం ఢీకొన్నారు. ఈ ఘటనలో ఊడికలపాడుకు చెందిన వారికి తీవ్రగాయాలు కాగా మిగిలిన ఇద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.



ఘటన స్థలంలో బాధితులు

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి.. కుమారుడి పరిస్థితి విషమం
- కుక్కను తప్పించబోయిన బోల్తాపడిన బైక్



మృతదేహాన్ని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్ : దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా తల్లీకొడుకులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తల్లి మృతిచెందగా.. కుమారుడి పరిస్థితి విషమంగా ఉంది. శ్రీకాకుళం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోలాకి మండలం రాజారాంపురం గ్రామానికి చెందిన తల్లీకొడుకులు మైలపల్లి గురుదేవి(48), అజిత్‌లు మంగళవారం నాగులచవితి సందర్భంగా ఇంటి నుంచి బయలుదేరి సింగుపురంలోని హాటకేశ్వరస్వామి ఆలయానికి బైక్‌పై బయలుదేరారు. స్వామి దర్శనం అనంతరం ఇంటికి తిరిగి వస్తుండగా సింగుపురం జాతీయ రహదారిపై కుక్క అడ్డంగా రావడంతో ఇద్దరూ స్కిడ్ అయ్యారు. గురుదేవి అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రగాయాలపాలైన అజిత్‌ను అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. పరిస్థితి విషమంగా మారడంతో కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలకేంద్రంలో నాగుపాము



స్లేడుపై నాగుపాము

సరుబుజ్జిలి: మండలంలోని అమృత లింగానగరం సమీపంలోని పాలకేంద్రంలో మంగళవారం నాగుపాము కలకలం సృష్టించింది. కేంద్రం లోపలి స్లేడుపై పాము బుసలుకొట్టడంతో సిబ్బంది ఉలిక్కిపడ్డారు. వెంటనే గ్రామస్తులు వచ్చి కర్రలతో పామును తరిమికొట్టారు.

ఫొటోగ్రఫీలో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో 30 మంది గ్రామీణ యువతకు ఫొటోగ్రఫీలో ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. గ్రామీణ యువతకు స్వయం ఉపాధి లక్ష్యంగే ఫొటోలు, వీడియోలు తీయడంపై నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

రణస్థలం: మండలంలోని పాతర్లపల్లి పంచాయతీ సూరంపేట గ్రామ శివారులో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని జె.ఆర్.పురం పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 97,830 నగదు, 9 సెల్‌ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. జెజే.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు బాలల దినోత్సవం పోటీలు

శ్రీకాకుళం కల్చరల్ : బాలల దినోత్సవం పురస్కరించుకొని 3 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కేంద్రంలోని బాల కథానిలయం వ్యవస్థాపకుడు భోగెల ఉమామహేశ్వరావు, ఉపాధ్యక్షుడు పి.దేవానంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నిమిషాల జాతీయ గీతాలాపన వీడియో, పది లైన్లలో బాలల కవితలు, నెహ్రూ, జాతీయ నాయకుల చిత్రాలు గీసి బాల కథానిలయానికి పంపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత పాఠశాల ఉపాధ్యాయుల సంతకం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ నెల 11లోపు ఎంట్రీలు పంపించాలని, ఆ తర్వాత వచ్చిన వాటిని పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. మూడు విభాగాల్లో ఒక విద్యార్థి ఒక పోటీకి మాత్రమే అర్హులని, 89191 71926 వాట్సాప్ నంబర్‌కు ఎంట్రీలు పంపించవచ్చని పేర్కొన్నారు.

బీడువారుతున్న పొలాలు

- వంశధార నీరు ఇవ్వాలని రైతుల వేడుకోలు



బీడు వారిన పొలాలను చూపుతున్న పోతయ్యవలస రైతులు



బీడువారిన పొలం

నరసన్నపేట: 'అయ్యా.. వంశధార ఇంజనీర్లూ. మీకు దండాలు. మావైపు చూడండి. గ్రామాలకు సాగునీరు రావడంలేదు. మొదట్లో వర్షాలు కలిసి రావడంతో ఇన్నాళ్లూ నెట్టుకొచ్చాం. ఇప్పుడు వర్షాలు పడేలా లేవు. పొలాలు బీటలు వారుతున్నాయి. ఒక్క తడికి నీరు ఇవ్వండి..' అంటూ నరసన్నపేట మండలంలోని కాలువ శివారు గ్రామాల రైతులు అధికారులకు వేడుకుంటున్నారు. పోతయ్యవలస, గోపాలపెంట, మడపాం, బుచ్చిపేటలతో పాటు శివారు గ్రామాల్లో నీరు లేక పొలాలు బీటలు వారాయి. వరి పంట గింజ ముదిరే స్థితిలో ఉంది. గతేడాదిలో కూడా ఇలాంటి పరిస్థితులే నెలకొనడంతో 300 ఎకరాల వరకూ పంట పోయింది. పొల్లు గింజలే మిగిలాయి. ఇప్పటి వరకూ అధిక పెట్టుబడులు పెట్టామని, పంట కూడా బాగుందని, ఇలాంటి సమయంలో వంశధార ఇంజనీర్లు ఒక్క తడికి నీరు ఇవ్వగలిగితే రైతులకు మేలు జరుగుతుందని పోతయ్యవలసకు చెందిన రైతులు కనపల శేఖరరావు, సురేష్ అన్నారు. నీరు అందకపోతే పెట్టుబడి వృథా అవుతుందని చెబుతున్నారు.

'చి'వరి' తడికి పాట్లు



జంబాడ వద్ద రైతులు ఏర్పాటు చేసిన దోనె



సిద్ధాంతం వద్ద ఆయిల్ ఇంజిన్‌తో సాగునీరు

ఎల్.ఎన్.పేట : రైతన్నలకు సాగునీటి కష్టాలు వీడటం లేదు. కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంట పండించేందుకు చి'వరి'తడిగా సాగునీరు అందించేందుకు రైతులు పాట్లు పడుతున్నారు. ఆఖరి తడిగా పంటకు నీరు అందిస్తే వరితో పాటు మినుములు, పెసర విత్తనాలు వేసుకునేందుకు అవకాశం ఉంటుందని కొండ దిగువన ఉన్న గిరిజనులు, వంశధార కుడిప్రధాన కాలువకు ఎగువన ఉన్న రైతులు భావిస్తున్నారు. ఎల్.ఎన్.పేట మండలంలోని జంబాడ, కొత్తబాలేరు, సరడాం, జాడుపేట, బొత్తాడసింగి, గొట్టిపల్లి, డొంకలబడవంజ, కొత్తపేట, కవిటి, కొత్తవలస, గోలుకుప్ప, కోతిగాడ్లపాడు, జోగివలస, మెట్టుగూడ, చొర్లంగి, సిద్ధాంతం, బరటాం తదితర గ్రామాల్లోని రైతులు ఆయిల్ ఇంజిన్లతో సాగునీరు తోడిస్తున్నారు. కొండ దిగువున ఉన్న రైతులు కొండ జక్కరగా వచ్చిన నీటిని దోనెలు ఏర్పాటు చేసుకుని పంటకు తడులు పెడుతున్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

- జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా

అరసవల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) నిధులతో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (2025–26) తయారీ ప్రక్రియకు సంబంధించిన జిల్లా స్థాయి టీవోటీఎస్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈవో ఎన్.వి.శ్రీధర్‌రాజా కోరారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం (డీపీఆర్సీ)లో మంగళవారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ విస్తరణాధికారులు, ఇద్దరు చొప్పున పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ ప్రాధాన్యత, గ్రామీణ స్థితిగతుల మదింపు పద్ధతులు, గ్రామీణ పేదరికం తగ్గింపు ప్రణాళిక (వీపీఆర్‌పీ) వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్, వైస్ ప్రిన్సిపాల్ డీపీఆర్సీ, జిల్లా పంచాయతీ అధికారి ఓ.భారతి సౌజన్య, జెడ్పీ డిప్యూటీ సీఈవో ఈ.సత్యనారాయణ, డీపీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ ఓ.నిశ్చల, ఎస్.లోకనాథరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ట్రిపుల్‌ఐటీ) ఎస్ఎంపురం క్యాంపస్ విద్యార్థిని గౌసియా మంగళవారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) మొదటి ఏడాది చదువుతున్న గౌసియా తరగతులు ముగిసాక హాస్టల్‌కు వెళ్లింది. అనంతరం గదిలో అపస్మారక స్థితికి చేరుకోవడంతో తోటి విద్యార్థులు గమనించి వసతి గృహ సంక్షేమాధికారులు, సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే క్యాంపస్ అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. జెటిపోస్టు పోలీసుల సమాచారం మేరకు ఎచ్చెర్ల ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, విద్యార్థిని జింక్‌ఫాస్ఫేట్ పౌడర్‌ను నీటిలో కలిపి తాగినట్లు సమాచారం. ల్యాబ్‌లో వాడే జింక్ ఫాస్ఫేట్ పౌడర్ ఈమె వద్ద ఎలా ఉందన్నది తెలియడం లేదు. ఆత్మహత్యాయత్నానికి వ్యక్తిగత సమస్యలే కారణమని అధికారులు చెబుతున్నారు. ఘటన జరిగిన వెంటనే అధికారులు తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో వారు నంద్యాల నుంచి శ్రీకాకుళం బయలుదేరారు.

ఉపాధ్యాయ సమస్యలపై వినతి



జెడ్పీ సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా పరిషత్ పీఎఫ్ విభాగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మజ్జి మదన్‌మోహన్, ఎస్.వి.అనిల్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల్లో నగదు ఎంత ఉందో తెలుసుకునే పీఎఫ్ స్లిప్పులు వెంటనే విడుదల చేయాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా నుంచి విడిపోయిన మండలాల పీఎఫ్ ఖాతాలు క్రమబద్ధీకరణ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఉద్యోగం చేస్తూ మధ్యలో చనిపోయిన వారికి బూస్టర్ స్కీం పునరుద్ధరించాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన సీఈఓ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు పి.అప్పలనాయుడు, జి.భీమారావు, బి.ఢిల్లేశ్వరరావు, కార్యదర్శులు చావలి శ్రీనివాస్, ఎస్.చాణిక్య, వి.నవీన్‌కుమార్, దాసరి రామ్మోహనరావు, పప్పల తిరుమలరావు, సదాశివుని శంకరరావు, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.